వర్షంతో నష్టపోయిన వారిని ఆదుకోవాలి

సీతారాంతండాలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబర్ 3: భారీ వర్షాలతో నష్టపోయిన వారిని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు చొరవ చూపి ఆదుకోవాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం నియోజకవర్గంలో పర్యటించి వర్షంతో కూలిన ఇండ్లను పరిశీలించి బాధితులను పరామర్శించారు. తన వంతు ఆర్థికసహాయం చేశారు. ఇండ్లు కూలి రోడ్డున పడ్డ వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. నష్టపోయిన పంటలు, దెబ్బతిన్న రోడ్లపైనా దృష్టిసారించాలన్నారు. ఆయన వెంట నాయకులు పార్శెట్టి సంగప్ప, శంకర్ నాయక్, మల్గొండ, పీరప్ప ఉన్నారు.

బీఆర్ఎస్ నేతలకు పరామర్శ

మనూరు, సెప్టెంబర్ 3: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సుధాకర్ ఇంటికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పరామర్శించారు. మనూరు మండల పరిధిలోని మాయికోడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుధాకర్ గుండె ఆపరేషన్ చేసుకొని ఇంటికి వచ్చిన సందర్భంగా మంగళవారం వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు వితల్‌రావు, గ్రామస్తులు కృష్ణ, గంగయ్య స్వామి, మంతుర్ అనంత్, గుండయ్య ఉన్నారు.

కల్హేర్‌లో..

కల్హేర్, సెప్టెంబర్ 3: ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుల కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పరామర్శించారు. మండల పరిధిలోని కృష్ణాపూర్‌కు చెందిన బైరు భూమయ్య, ఫతేపూర్ గ్రామానికి చెందిన లక్ష్మాగౌడ్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మృతికి గల కారణాలు తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనవెంట మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, నాయకులు అంజయ్యసాగర్, రాంరెడ్డి, సాయిగొండ, సాయిలు, సాయిగొండ, సాయగౌడ్, గుండన్న, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, మొగులయ్య, కిష్టయ్య ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

మునిపల్లి పీహెచ్‌సీలో పేషెంట్‌తో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గాయత్రిదేవి

మునిపల్లి, సెప్టెంబర్ 3: ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో గాయత్రిదేవి ఆదేశించారు. మంగళవారం నమస్తే తెలంగాణ దినపత్రికలో 'మంత్రి ఇలాకాలో వైద్యం ఇలాగేనా?' శీర్షికతో వచ్చిన కథనానికి డీఎంహెచ్‌వో గాయత్రిదేవి స్పందించారు. మునిపల్లి ప్రభుత్వ దవాఖానను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందించి మందులు ఇవ్వాలన్నారు. రోగుల పట్ల ప్రేమతో ఉంటూ వైద్యసేవలు అందించాలన్నారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం దవాఖాన వరండాలో వైద్యం అందించినవారిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్న తరుణంలో వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటించి అనారోగ్యం బారిన పడిన వారి వివరాలు సేకరించాలన్నారు.

భవన యజమానికి నోటీసులు

లక్ష్మీనగర్‌లో శిథిలావస్థకు చేరిన భవనాన్ని పరిశీలిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారి పవన్

బొల్లారం, సెప్టెంబర్ 3: భారీ వర్షాల నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన భవనాలపై 'నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురించిన 'ఆదమరిస్తే అంతే' కథనానికి అధికారులు స్పందించారు. కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ లక్ష్మీనగర్‌లోని భవన యజమాని బన్సిలాల్‌కు నోటీసులు ఇచ్చారు. తక్షణమే ఇంట్లో ఉన్న ఎనిమిది కుటుంబాలను మరోచోటుకి తరలించి భవనాన్ని ఖాళీ చేయాలని ఆదేశించారు. వర్షాలతో భవనానికి ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ మున్నీ నవీన్ కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డుపై పడిన చెట్టు తొలిగింపు

గండిగూడెం రోడ్డుపై విరిగిపడిన చెట్టును తొలిగిస్తున్న మాన్‌సూన్ టీం సభ్యులు

బొల్లారం, సెప్టెంబర్ 3: భారీ వర్షాలకు బొల్లారం మున్సిపాలిటీ శివారు గండిగూడెం రోడ్డుపై చెట్టు విరిగిపడిందని 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మంగళవారం కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ మాన్‌సూన్ టీం సభ్యులతో రోడ్డుపై విరిగిపడ్డ చెట్టును తొలిగించారు. దీంతో ప్రయాణ ఇబ్బందులు తొలిగిపోయాయి.

వైద్య శిబిరాలకు స్పందన

సంగారెడ్డి, సెప్టెంబర్ 3: ఆరోగ్యాలను కాపాడుకునేందుకు ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉచితంగా దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మంగళవారం పట్టణంలోని బైపాస్ రోడ్డులోని ఎల్ ఐసీ కార్యాలయంలో ఉద్యోగులకు కొత్త బస్టాండ్ ముందున్న సిరి డెంటల్ ప్రైవేట్ దవాఖాన యాజమాన్యం ఆధ్వర్యంలో పంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎల్ఐసీ ఏజెంట్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో దంత వైద్య నిపుణులు హన్మంత్‌రెడ్డి తన వైద్య బృందంతో ఎల్ఐసీ ఉద్యోగులకు వైద్య సేవలు అందించారు. ఎల్ఐసీ ఉద్యోగులతో పాటు ఏజెంట్లు, ఖాతాదారులు పరీక్షలు చేయించుకున్నారు.

మాధురలో వైద్య శిబిరం

హత్నూర, సెప్టెంబర్ 3: మండలంలోని మాధురలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సూరారంలోని మల్లారెడ్డి దవాఖానకు చెందిన వైద్యులు గ్రామస్తులకు పలురకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు కృష్ణసాయి, రూప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి విరమణ తప్పదు

విజయ్‌బాబును సన్మానిస్తున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్, చైర్‌పర్సన్ విజయలక్ష్మి

సంగారెడ్డి, సెప్టెంబర్ 3: ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే విరమణ కాలం దగ్గర పడుతుందని, ప్రతి ఉద్యోగికి విరమణ తప్పదని ట్రైనీ కలెక్టర్ మనోజ్ అన్నారు. మంగళవారం టీఎన్జీవోస్ భవన్‌లో మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి విరమణ పొందిన విజయ్‌బాబును శాలువాలతో సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ ప్రసాద్‌చౌహాన్, డిప్యూటీ ఇంజినీర్ ఇంతియాజ్ అహ్మద్, కౌన్సిలర్లు మందుల నాగరాజ్, రామప్ప, కొత్తపల్లి శ్రీకాంత్(నాని), మాజీ కౌన్సిలర్ శివుడు, నాయకులు కూన సంతోష్, యాకుబ్ అలీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పొంగి పొర్లుతున్న నల్లవాగు ప్రాజెక్టు

పొంగిపొర్లిన నల్లవాగు ప్రాజెక్టు

నల్లవాగు ప్రాజెక్టును అధికారులు, రైతులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

సిర్గాపూర్, సెప్టెంబర్ 3: మండలంలోని నల్లవాగు ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండి అలుగు పారుతున్నది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా కురిసిన వర్షానికి ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద రావడంతో రెండు రోజుల్లోనే నల్లవాగు పూర్తిగా నిండి జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టులో 5,647 క్యూసెక్కులు వరద చేరుతున్నదని, ఒక్క అడుగు ఎత్తులో అలుగు దిగువకు 4,260 క్యూసెక్కులు వరద నీరు జోరుగా పారుతున్నట్లు ప్రాజెక్టు ఏఈ సూర్యకాంత్ తెలిపారు.

పరిశీలించిన ఎమ్మెల్యే

నల్లవాగును నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ్‌రెడ్డి, ఆర్డీవో అశోక చక్రవర్తి మంగళవారం పరిశీలించారు. ప్రాజెక్టు కట్టపై నడుస్తూ పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి పూజలు చేసి తెప్పను వదిలారు. అనంతరం ఎమ్మెల్యే, ఇరిగేషన్ అధికారులతో కలిసి ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వ ద్వారా దిగువకు జలాలను వదిలారు. ప్రాజెక్టు నుంచి నీటి వృథా అరికట్టి ఆయకట్టు పరిధిలోని చెరువులకు మళ్లించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమాశంకర్, కాంగ్రెస్ నాయకులు, రైతులు, ఇరిగేషన్ అధికారులు పవన్‌కుమార్, సూర్యకాంత్, లష్కర్ సిబ్బంది ఉన్నారు.

సాకీ చెరువు తూముకు గండి

మండల కేంద్రమైన సిర్గాపూర్ శివారులోని సాకీ చెరువు తూముకు గండి పండి పడడంతో రెండు రోజులుగా నీరు వృథాగా పోతున్నది. గుర్తించిన స్థానిక రైతులు, మాజీ ఎంపీటీసీలు సంజీపరావు, రాజ్‌కుమార్, పీరప్ప చెరువుక ట్టును పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులకు సమాచారమందించారు. తూము వద్ద ఇసుక సంచులు నింపి తూమును మూసివేసి నీటి వృథాకు అడ్డుకట్ట వేశారు.

కూలిన ఇండ్లు.. నీట మునిగిన పంటలు

కంది: బ్యాతోల్‌లో కూలిన ఇల్లు

కోహీర్: బీదర్ బేస్ ప్రాంతంలో..

నిజాంపేట్: ఇంటిని పరిశీలిస్తున్న ఆర్ఐ

కంది, సెప్టెంబర్ 3: కురుస్తున్న భారీ వర్షాలతో కంది మండలంలోని గ్రామాలు జలమయమయ్యాయి. వాగులు పారుతుండగా, చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. ఎకధాటిగా కురుస్తున్న వర్షాలతో పలు గ్రామాల్లో ఇండ్లు కూలిపోగా, వరి, పత్తి తదితర పంటలు దెబ్బతిన్నాయి. కలివేముల గ్రామంలో నాలుగు, బ్యాతోల్‌లో ఒక ఇల్లు కూలిపోయింది. కూలిన ఇండ్లను అధికారులు పరిశీలించి వివరాలు సేకరించారు. రహదారులు బురదమయం కాగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మనూరులో..

మనూరు, సెప్టెంబర్ 3: భారీ వర్షాలకు పలు గ్రామాల్లో పెంకుటిండ్లు కూలాయని తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని అతిమ్యాల్, ధన్వార్, పుల్‌కుర్తి, దుదగొండ, రాణాపూర్ గ్రామాల్లో పలు పెంకుటిండ్లు కూలినట్టు తెలిపారు. ఇండ్లల్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదాలు జరుగలేదని పేర్కొన్నారు. గ్రామాల్లో ఆర్ఐలు రాంచందర్, శంకర్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారని తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

నిజాంపేట్, సెప్టెంబర్ 3: భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిజాంపేట్ తహసీల్దార్ నాగజ్యోతి సూచించారు. రైతులు, పశువుల కాపరులు వాగులు, కుంటల దగ్గరికి వెళ్లొద్దన్నారు. బోరు బావుల దగ్గర విద్యుత్ తీగలు గాలికి నేలవాలినా, తెగిపడినా, చెట్లు విరిగి పడినట్లు కనిపించినా ముట్టుకోకుండా విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. మండల కేంద్రంలో భారీ వర్షాలకు కూలిన పలువురి ఇండ్లను తహసీల్దార్ ఆర్ఐ జాన్‌సన్ సన్నీతో కలిసి పరిశీలించారు.

ఝరాసంగం: పొట్టిపల్లిలో చెరుకు తోటలో..

హత్నూర: కాసాల పెద్ద చెరువును పరిశీలిస్తున్న అధికారులు

గుమ్మడిదల: పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

హడ్నూర్‌లో నీట మునిగిన పత్తి

పొలాల్లో నీరు నిల్వ ఉండొద్దు

న్యాల్‌కల్, సెప్టెంబర్ 3: పంటపొలాల్లో నీరు నిల్వ ఉండకుండా బయటకు పంపించాలని మండల వ్యవసాయాధికారి అభినాష్‌వర్మ రైతులకు సూచించారు. భారీ వర్షాల కారణంగా పంటలు పాడయ్యే అవకాశం ఉందన్నారు.

రాయికోడ్: నీరూర్ వద్ద రోడ్డు పాడవడంతో మూసివేస్తున్న అధికారులు

వట్‌పల్లి: అలుగు పారుతున్న ఖాదిరాబాద్‌లోని మైనోద్దిన్ కుంట(పెద్ద చెరువు)

బాధితుడికి పరిహారం అందించాలి

సనత్‌నగర్‌లోని పీసీబీ కార్యాలయం వద్ద గడ్డపోతారం గ్రామస్తులు

జిన్నారం, సెప్టెంబర్ 3: గడ్డపోతారం పంచాయతీ కిష్టయ్యపల్లి గ్రామానికి చెందిన బశెట్టి సాయికుమార్ కుటుంబానికి చెందిన 18 బర్రెలు కాలుష్య జలాలు తాగి మృతి చెందిన సంగతి తెలిసిందే. మంగళవారం గడ్డపోతారం, కిష్టయ్యపల్లి గ్రామస్తులు పరిహారం కోసం సనత్‌నగర్‌లోని పీసీబీ కార్యాలయానికి వెళ్లారు. పీసీబీ మెంబర్ సెక్రటరీ రవిని కలిసి బాధితుడికి పరిహారాన్ని పద్దెనిమిది పరిశ్రమల నుంచి అందజేయాలని కోరారు. వచ్చే నెలలో పరిశ్రామికవేత్తలతో సమావేశం ఏర్పాటు చేసి బాధిత కుటుంబానికి కలెక్టర్ చేతుల మీదుగా పరిహారం అందజేస్తామని పీసీబీ ఎంఎస్ తెలిపినట్లు గ్రామస్తులు తెలిపారు. పరిహారం కంటే పద్దెనిమిది బర్రెలను బాధిత కుటుంబానికి ఇప్పించాలని కోరామన్నారు. ఇదే విషయమై ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని కలిసి వివరించామన్నారు. మాజీ సర్పంచ్‌లు ప్రకాశ్‌చారి, నీరుడి శ్రీనివాస్, అశోక్, మాజీ ఎంపీటీసీ బాశెట్టి రాజు, నాయకులు వేణు, పెంటేశ్, శివశంకర్, నర్సింగ్‌రావు, సత్యం, గణేశ్ పాల్గొన్నారు.

దోస్త్ స్పెషల్ డ్రైవ్ ఫేజ్

సద్వినియోగం చేసుకోవాలి

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 3: ఇప్పటివరకు డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందలేని విద్యార్థులకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మరో అవకాశం కల్పించింది. ఈ మేరకు మంగళవారం ఉన్నత విద్యా మండలి కన్వీనర్, ప్రొఫెసర్ లింబాద్రి, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ దేవసేన దోస్త్ స్పెషల్ డ్రైవ్ ఫేజ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ క్రమంలో స్థానిక తారా ప్రభుత్వ, జిల్లా ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ మంగళవారం ప్రకటన జారీ చేశారు. జిల్లాలోని విద్యార్థులు దోస్త్ స్పెషల్ డ్రైవ్ ఫేజ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దోస్త్ స్పెషల్ డ్రైవ్ ఫేజ్ రిజిస్ట్రేషన్లను రూ.400లతో ఈ నెల 4 నుంచి 9లోగా చేసుకోవచ్చన్నారు. ఈ నెల 4 నుంచి 9 వరకు వెబ్ ఆప్షన్లను పెట్టుకోవాలన్నారు. స్పెషల్ ఫేజ్ వెరిఫికేషన్ ఆఫ్ స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్స్ సెప్టెంబర్ 9న ఉంటుందని, సెప్టెంబర్ 11న స్పెషల్ డ్రైవ్ ఫేజ్ సీట్ అలాట్‌మెంట్ ఉంటుందని, సెప్టెంబర్ 11 నుంచి 13 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్, 12 నుంచి 13వ తేదీల్లో సంబంధిత కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని వివరించారు. ఇప్పటికే దోస్త్ రిజిస్ట్రేషన్ చేసుకొని ఏ కళాశాలలో ప్రవేశం పొందని విద్యార్థులతోపాటు ఇప్పటివరకు దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని విద్యార్థులు కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకొని ప్రవేశం పొందవచ్చన్నారు. డిగ్రీ విద్యార్థుల కోసం కల్పించిన స్పెషల్ డ్రైవ్ ఫేజ్ ప్రవేశాలను జిల్లాలోని ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గంజాయితో పట్టుపడిన వ్యక్తికి ఐదేండ్ల జైలు

అందోల్, సెప్టెంబర్ 3: గంజాయి తరలిస్తూ పట్టుబడిన వ్యక్తికి మంగళవారం మెదక్ ఫస్ట్ అడిషనల్ కోర్టు మెజిస్ట్రేట్ జయంతి రూ.25 వేల జరిమానా, ఐదేండ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్‌రెడ్డి తెలిపారు. 2019లో విశాఖపట్నానికి చెందిన గార సన్యాసిరావు 10 కిలోల ఎండు గంజాయిని తరలిస్తూ జోగిపేట ఆర్టీసీ బస్టాప్‌లో మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు పట్టుబడ్డాడు. అతడిని అరెస్ట్ చేశారు. మంగళవారం అతడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

జిన్నారం, సెప్టెంబర్ 3: మండల కేంద్రం జిన్నారం గ్రామానికి చెందిన ఎర్ర వల్లి అనసూయ ఇటీవల గుండె నొప్పితో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ గ్రామ నాయకుడు, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ మంగళవారం రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు.

మట్టి గణేశ్‌ల పంపిణీ హర్షణీయం

మట్టి వినాయకులను ఆవిష్కరించిన ఎస్పీ చెన్నూరి రూపేశ్

ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి, సెప్టెంబర్ 3: గణేశ్ చతుర్థి రాగానే ఊరూవాడా వినాయకుల సందడి ప్రారంభమవుతుందని, మట్టి గణేశులతో పర్యావరణానికి మేలు జరుగుతుందని ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. మంగళవారం వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు తోపాజీ అనంతకిషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయకులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మట్టి వినాయకులతో పర్యావరణానికి ముప్పు తప్పుతుందని, ప్రతిఒక్కరూ మట్టి గణేశులనే పూజించాలన్నారు. అందుకు మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి పుల్లూరి ప్రకాశ్, సభ్యులు విద్యాసాగర్, విజయ్, భాస్కర్, ప్రదీప్, భక్త శ్రీనివాసులు, రాచర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

రైతులందరికీ రుణమాఫీ చేయాలని ఏడీఏకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

రాయికోడ్, సెప్టెంబర్ 3: అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం తప్పకుండా రుణమాఫీ చేస్తుందని రాయికోడ్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ సత్యానారాయణ అన్నారు. మంగళవారం రాయికోడ్‌లోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వివిధ కారణలతో రూ.2 లక్షల రుణమాఫీ కాని రైతులు ఆధార్ కార్డుతో పరిశీలించుకోవాలన్నారు. రూ.2 లక్షల కంటే ఎక్కువ పంట రుణాలుంటే వెంటనే బ్యాంకుల్లో చెల్లించి రుణమాఫీ పొందాలన్నారు. రుణమాఫీ కాని రైతులు రైతు వేదికల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రుణమాఫీ కాని రైతులు అధైర్యపడొద్దని, అర్హులందరికీ రుణమాఫీ అవుతుందన్నారు. బ్యాంక్ అధికారులు సమాచారం ఇవ్వడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏఈవో మాదగిరి, మల్లేశం, రమేశ్ పాల్గొన్నారు.

ఓల్డ్ ఆర్సీపురంలో కార్పొరేటర్ పర్యటన

ఓల్డ్ ఆర్సీపురంలో బస్తీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, సెప్టెంబర్ 3: ఓల్డ్ ఆర్సీపురంలో రాయసముద్రం చెరువు నాలా పక్కన ఉన్న బస్తీలో కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ పర్యటించారు. భారీ వర్షాలకు పలు ఇండ్లల్లోకి వర్షపు నీరు చేరింది. రాయసముద్రం చెరువు నాలాకు ఆనుకొని పలు ఇండ్లు ఉండడంతో వర్షపు నీరు ఇండ్ల ముందు నుంచి పారుతున్నాయి. వర్షపు నీటిని బయటకు పంపించేందుకు కార్పొరేటర్ మాన్సూన్ బృందంతో వెళ్లి ఇండ్ల ముందు నిలిచిన నీటిని బయటకు తొలిగించారు. రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలిగించేలా చర్యలు తీసుకోవాలని బల్దియా సిబ్బందికి సూచించారు.

గంగా నర్సరీని పరిశీలించిన మెదక్ ఎంపీ

నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి, సెప్టెంబర్ 3: కొత్త వంగడాలను తయారు చేసి తక్కువ కాలంలో కోతకు వచ్చే మామిడి రకాలను రైతులకు అందజేస్తున్న గంగా నర్సరీని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సందర్శించారు. మంగళవారం పట్టణంలోని రాజంపేటలోని గంగా నర్సరీని పరిశీలించి మేలు రకం వంగడాలపై నర్సరీ యాజమాని మోహన్‌తో మాట్లాడారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

జాబ్ మేళాకు వచ్చిన అభ్యర్థులకు సూచనలు చేస్తున్న ఎంఆర్ఎఫ్ ప్రతినిధులు

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 3: డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థుల కోసం స్థానిక తారా ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు బుధవారం అనూహ్య స్పందన లభించింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ మాట్లాడుతూ తారా ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, ఈడీసీ, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఎంఆర్ఎఫ్ సహకారంతో నిర్వహించిన జాబ్‌మేళాకు 108 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. దాదాపు 100 మందికి ఉద్యోగావకాశాలు వచ్చాయన్నారు. జాబ్‌మేళాలతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో ఎంఆర్ఎఫ్ హెచ్ఆర్ మేనేజర్లు రఘురాం, రమేశ్‌కుమార్, ప్రొడక్షన్ ఇన్‌చార్జి అజయ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ్య కుమార్ పాల్గొన్నారు.

హరీశ్‌రావుపై దాడి హేయమైన చర్య

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబర్ 3: ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం హేయమైన చర్య అని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. హరీశ్‌రావుపై దాడిని తీవ్రంగా ఖండించిన మాజీ ఎమ్మెల్యే ఈ ఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు మనస్సురాని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిల్లర రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో ప్రధాన ప్రతిపక్షంగా ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత బీఆర్ఎస్‌పై ఉన్నదన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఇటువంటి దాడులను ఎన్నో ఎదుర్కొని తెలంగాణను తెచ్చిన విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. దాడుల సమయంలో పోలీసులు చోద్యం చూడడం సరికాదని, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ నేతలపై దాడి అమానుషం

ఆదర్శ్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత

రామచంద్రాపురం, సెప్టెంబర్ 3: ఖమ్మంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడడం అమానుషమని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించి నిత్యావసర సరుకులు అందచేయడానికి ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆధ్వర్యంలో ఖమ్మం వెళ్లిన ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంబిపూర్‌రాజు తదితర నేతలపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని మండిపడ్డారు. వరద బాధితులను బీఆర్ఎస్ నాయకులు ఆదుకోవడాన్ని జీర్ణించుకోలేకనే కాంగ్రెస్ నేతలు దాడులకు దిగారని ఆరోపించారు. వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని, వారికి బీఆర్ఎస్ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందన్నారు. తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీనే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు.

న్యాల్‌కల్ ఎంపీడీవోగా రాజశేఖర్

న్యాల్‌కల్, సెప్టెంబర్ 3: ఎంపీడీవోగా రాజశేఖర్‌ను నియమిస్తూ మంగళవారం సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. స్థానికంగా సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రాజశేఖర్‌ను ఎంపీడీవోగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నాగల్‌గిద్ద ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులను నిర్వహిస్తున్నారు.